భారీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఐటీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 25 : ఈ నెల 27న చేవెళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఐటీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించే సభకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ప్రియాంకాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి హాజరై గృహజ్యోతి (200 యూనిట్ల విద్యుత్), రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాలను అధికారికంగా చేవెళ్ల నుంచే ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి జనాన్ని తరలించాలని తెలిపారు. దాదాపు లక్షకు పైగా జనం వచ్చేలాఅన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబట్టుకుంటుందని తెలిపారు. బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, చేవెళ్ల సీనియర్ నాయకుడు భీమ్ భరత్, నాయకులు ఉన్నారు.

శిక్షణా తరగతుల్లో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి, సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలమ్మ

పర్యావరణానికి మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలి

విద్యావేత్త, ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి

అన్మాస్‌పల్లి ఎర్త్ సెంటర్‌లో ముగిసిన లీడ్ ఎర్త్ లీడర్స్ శిక్షణా కార్యక్రమం

కడ్తాల్, ఫిబ్రవరి 25 : విద్యార్థులు చిన్నతనం నుంచే పర్యావరణానికి మేలు చేసే కార్యక్రమాలను చేపట్టాలని ప్రముఖ విద్యావేత్త, ప్రొఫెసర్ ఎన్.ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో గల ఎర్త్ సెంటర్‌లో తెలంగాణ విద్యాశాఖ-సీజీఆర్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన లీడ్ ఎర్త్ లీడర్స్ శిక్షణా తరగతులు ఆదివారం ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నిరంతరం ఉత్సాహంతో సమాజానికి, పర్యావరణానికి హితం చేకూర్చే పనులు చేయాలని తెలిపారు. ప్రతి విద్యార్థి పర్యావరణ నాయకత్వం వహించాలని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని వివరించారు.

లీలమ్మ మాట్లాడుతూ.. సీజీఆర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని యజ్ఞంలా చేపట్టామని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం శిక్షణా తరగతుల్లో పాల్గొన్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నారాయణపేట్ జిల్లాలకు చెందిన 130 మంది విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్, నారాయణపేట్, రంగారెడ్డి జిల్లాల డీఎస్‌వోలు శ్రీనివాసులు, భానుప్రకాశ్, శ్రీనివాసరావు, ఎస్‌సీఈఆర్‌టీ నిపుణులు వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమేశ్‌రావు, సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్తలు సాయిభాస్కర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మల్లేశం, బాలరాజు, నరసింహులు, మాధవి, యమున, జయప్రద, సీజీఆర్ ప్రతినిధులు వెంకటేశ్, రజనీకాంత్, బీరేశ్, లక్ష్మీప్రసన్న, సుష్మా, నగేశ్ పాల్గొన్నారు.

ఒక్కో అకౌంట్‌కు లక్ష

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): ఒక్కో బ్యాంకు అకౌంట్‌కు లక్ష రూపాయల కమీషన్ తీసుకుంటూ సైబర్‌నేరగాళ్లకు ఇండియన్ బ్యాంకు ఖాతాలు అందిస్తున్న వ్యక్తిని సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అదనపు సీపీ ఏవీ రంగనాథ్ కథనం ప్రకారం.. పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో నగరానికి చెందిన ఒక వ్యక్తికి రూ. 2,38,405లను మోసం చేయడంతో బాధితుడు సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ ఎన్.నరేశ్ నేతృత్వంలోని బృందం కేసు దర్యాప్తు చేపట్టింది. నిందితుడు మహ్మద్ సోయాబ్ బాబ్లు ఖాన్ సైబర్‌నేరగాళ్లతో చేతులు కలిపాడు. బాధితుల నుంచి దోచుకున్న సొమ్మును డిపాజిట్ చేయించేందుకు సైబర్ నేరగాళ్లకు కావాల్సిన బ్యాంకు ఖాతాలు అందిస్తున్నాడు. ఇందుకు ఒక్కో ఖాతాకు లక్ష రూపాయలు తీసుకుంటున్నాడు. ఈ వ్యవహారంలో బాధితుడు వేసిన సొమ్ము సోయాబ్ బాబ్లు ఖాన్ ఖాతాలోనూ డిపాజిట్ అయినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి అతడి ఖాతాలో ఉన్న రూ. 5 లక్షలు సీజ్ చేసి.. బ్యాంకింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి దేశ వ్యాప్తంగా 42 కేసులతో సంబంధాలుండగా.. తెలంగాణలో ఆరు కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

పరిగి మండలం సయ్యద్‌మల్కాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం(ఫైల్)

ప్రజాపాలన సభల

పైసలివ్వరా?

- నెలన్నర దాటినా అందని డబ్బులు
- సొంత ఖర్చుతో సభల ఏర్పాట్లు చేసిన గ్రామపంచాయతీ కార్యదర్శులు
- ఒక్కో సభకు రూ.10 వేలు ప్రకటించిన సర్కార్
- రూ.20 వేల వరకు ఖర్చు చేశామంటున్న పంచాయతీ సెక్రటరీలు
- రూ.5వేలు ఇచ్చి చేతులు దులుపుకొంటున్న అధికారులు
- దరఖాస్తులు ఆన్‌లైన్ చేసిన కొందరు ఆపరేటర్లకూ అందని డబ్బులు

పరిగి, ఫిబ్రవరి 25 : ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన సభల ఏర్పాట్ల డబ్బులు ఇప్పటికీ ఇవ్వకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాపాలన సభల నిర్వహణకు ప్రతి గ్రామపంచాయతీకీ రూ.10వేల చొప్పున ప్రభుత్వం ముందుగానే ప్రకటించినా సర్పంచ్‌లు ముందుకు రాలేదు. దీంతో ఉన్నతాధికారుల ఒత్తిడితో గ్రామపంచాయతీ కార్యదర్శులే తమ సొంత డబ్బులతో అన్నీ ఏర్పాటు చేశారు. టెంట్లు, కుర్చీలు, ప్రతి వంద మందికి ఒక టేబుల్, మైక్ వంటి వసతులు కల్పించారు. అంతేకాకుండా సమావేశానికి హాజరైన మండల స్థాయి అధికారులు, పక్క గ్రామపంచాయతీల కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ ఎంలు, ఇతర అధికారులకు భోజన సౌకర్యం కూడా కల్పించడంతో ఖర్చు తడిసి మోపెడైంది. పెద్ద గ్రామపంచాయతీల్లో సభల ఏర్పాట్లకు రూ.20వేల వరకు ఖర్చు అయినట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

పరిగి మండలంలో రూ.5వేలతో సరిపెట్టిన అధికారులు..

ప్రజాపాలన ఏర్పాట్లకు సంబంధించి ప్రతి గ్రామపంచాయతీకీ ప్రభుత్వం రూ.10వేలు మంజూరు చేసింది. అయితే ఇతర మండలాల్లో ఈ మేరకు డబ్బులు అందించినా పరిగి మండలంలో మాత్రం గ్రామపంచాయతీకీ రూ.5వేల చొప్పున డబ్బులిచ్చి చేతులు దులుపుకున్నారు. ప్రజాపాలన కార్యక్రమం ముగిసి నెలన్నర దాటినా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించలేదు. డబ్బుల విషయం అడిగితే ఏదో ఒక విధంగా ఇబ్బందులకు గురి చేస్తారనే భయాందోళనతో పలువురు గ్రామపంచాయతీ కార్యదర్శులు మిన్నకుండిపోతున్నారు. కొందరు ధైర్యం చేసిన అడిగినా.. ఇంకా రాలేదు, వచ్చిన వెంటనే ఇస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారు.

ఒక బృందంలో ఆపరేటర్లకూ అందని డబ్బులు..

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినా ఆపరేటర్లకూ డబ్బులు అందలేదు. ఒక్కో దరఖాస్తుకు రూ.5చొప్పున ప్రభుత్వం మంజూరు చేసినా కొందరికీ ఇంకా డబ్బులు చెల్లించలేదు. పరిగి మండలంలో తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, వ్యవసాయాధికారిల నేతృత్వంలోని నాలుగు ప్రత్యేక బృందాలతో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. ఒక్కో బృందంలో కనీసం పది మంది చొప్పున ఆపరేటర్లు పనిచేశారు. ఇందులో మూడు బృందాల వారికి డబ్బులు అందినా.. ఎంపీడీవో బృందంలో పనిచేసిన ఆపరేటర్లకు మాత్రం ఇప్పటికీ డబ్బులు చెల్లించలేదు. పరిగి ఎంపీడీవోగా పనిచేసిన శేషగిరిశర్మ ఇటీవలే బదిలీపై వెళ్లడంతో తమకు డబ్బులు ఎవరు, ఎపుడు ఇస్తారని ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమకు డబ్బులు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పరిగిలో దరఖాస్తులు రాక ఇలా..

2023 డిసెంబర్ 28 నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించింది. ప్రతి మండలానికో జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించడంతోపాటు సమన్వయం కోసం ప్రతి నియోజకవర్గానికీ జిల్లా స్థాయి అధికారి నియమించి ప్రజాపాలనను చేపట్టింది. గ్రామసభలకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీవోలు, వ్యవసాయాధికారులు, ఇతర అధికారుల హాజరై దరఖాస్తుల స్వీకరించారు. ప్రతి వందమందికి ఒక ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. పరిగి మండలంలోని 37 గ్రామపంచాయతీల్లో 13865 అభయహస్తం, 2779 ఇతర దరఖాస్తులు రాగా, పరిగి మున్సిపాలిటీలో 5224 అభయహస్తం , 1672 ఇతర దరఖాస్తులు అందాయి.

కేటీఆర్‌కు ఘన స్వాగతం

కడ్తాల్‌లో కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్, నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 25 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అచ్చంపేట్, నాగర్‌కర్నూల్ పట్టణాల్లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సమీక్షా సమావేశాల్లో పాల్గొనడానికి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కడ్తాల్‌లో జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆయన రాక సందర్భంగా కడ్తాల్‌లో కార్యకర్తలు పెద్ద ఎత్తున పటాకులు కాల్చారు. అనంతరం ఆయనను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, వైస్ ఎంపీపీ ఆనంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు గోపాల్, మంజుల, ప్రియ, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు వీరయ్య, గంప శ్రీను, కృష్ణయ్యయాదవ్, తులసీ రాంనాయక్, నర్సింహ, సాయిలు, చంద్రమౌళి, జంగయ్యగౌడ్, బిచ్చానాయక్, యాదయ్య, సేవ్యానాయక్, హర్యా, లాయక్‌అలీ, రాజేందర్, రమేశ్, మహేశ్, ఇర్షాద్, లింగం, జమీర్, శ్రీశైలం, గోపాల్, అంజి, శ్రీకాంత్, మల్లేశ్, రాములు, భీమన్, శ్రీనివాస్, లక్ష్మణ్, చందర్, పాండు పాల్గొన్నారు.

గుర్రంగూడలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

సేవాలాల్ ఆశయ సాధనకు కృషి

- సేవాలాల్ జయంత్యుత్సవంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 25: సంత్ సేవాలాల్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట పరిధిలోని గుర్రంగూడ జీపీఆర్ కన్వెన్షన్ హాల్ గుర్రంగూడ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బంజారా సంఘం నాయకులు ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డిని, బాలూనాయక్, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం, సబితారెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో చేసిందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో సేవాలాల్ మందిరానికి స్థలం కేటాయించామని పేర్కొన్నారు. సేవాలాల్ చరిత్రను రేపటి తరాలకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మారెడ్డి, శంకర్, ఏనుగు రాంరెడ్డి, బీమిడి జంగారెడ్డి, సంరెడ్డి వెంకట్‌రెడ్డి, అశోక్, సాయికిరణ్, గుర్రంగూడ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధిగమించాల్సిన సవాళ్లెన్నో..!

మెట్రో రెండో దశ డీపీఆర్ రూపకల్పనలో ఎదురవుతున్న క్లిష్ట పరిస్థితులు

- ఒకే చోట రెండంతస్తుల పై ఓవర్లు
- ఎల్బీనగర్, సాగర్ రింగు రోడ్ల కూడళ్లలో పరీక్షగా మారిన నిర్మాణం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): రెండో దశ మెట్రో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు సవాళ్లు ఎదురవుతున్నాయి. నిత్యం ట్రాఫిక్‌తో నిండి ఉండే నగరంలో మెట్రో కారిడార్ల నిర్మాణం అధికారులకు ఒక పరీక్షగా మారింది. ప్రధానంగా నాగోల్ నుంచి ఎల్బీనగర్, సాగర్ రింగు రోడ్డు మీదుగా చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు నిర్మిస్తున్న కారిడార్‌లో పలు చోట్ల మెట్రో పిల్లర్లతో పాటు స్టేషన్ల నిర్మాణం పెద్ద సవాలుగా మారిందని మెట్రో అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం డీపీఆర్‌ను రూపొందించేందుకు హైదరాబాద్ మెట్రో అధికారులతో పాటు రెండు కన్సల్టెన్సీ సంస్థలు క్షేత్ర స్థాయిలో పలు అంశాల్లో అధ్యయనం చేస్తున్నాయి. నిర్ణయించిన కారిడార్‌లో మెట్రో స్టేషన్ల నిర్మాణం ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మించాలంటే క్షేత్ర స్థాయిలోని పరిస్థితులు సంక్లిష్టంగా మారాయి. నగరానికి ఇన్నర్ రింగు రోడ్డుగా ఉన్న ఈ మార్గంలో అడుగడుగునా సవాళ్లు ఎదురవుతున్నాయి. పెరిగిన రద్దీకి తోడు ఇతర నిర్మాణాలు, భూగర్భంలో మంచినీరు, డ్రైనేజీ లైన్లు, విద్యుత్, టెలీ కమ్యూనికేషన్స్ వంటి మౌలిక వసతులకు సంబంధించినవి ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొంటూ.. సమగ్రమైన ప్రాజెక్టు నివేదికను రూపొందించడం సంక్లిష్టంగా మారిందని మెట్రో అధికారులు చెబుతున్నారు.

రెండు లెవల్స్‌లో ఫై ఓవర్లు

మెట్రో రెండో దశలో అత్యంత పొడవైన కారిడార్‌గా ఉన్న నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంలో పలు చోట్ల ఫై ఓవర్లు ఉన్నాయి. నాగోల్, కామినేని, ఎల్బీనగర్, సాగర్ రింగు రోడ్డు, ఓవైసీ ఆస్పత్రి, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో రోడ్డు మధ్యలోనే ఫై ఓవర్లు ఉన్నాయి. దీంతో మెట్రో కారిడార్‌ను రోడ్డు మధ్యలో కాకుండా ఒక పక్క నుంచి నిర్మించాల్సిన పరిస్థితి ఉన్నదని గుర్తించారు. ఎల్బీనగర్, సాగర్ రింగు రోడ్డు వద్ద ఫై ఓవర్ల పక్క నుంచి కాకుండా అడ్డంగా ఉన్నాయి. ఇక్కడి నుంచి మెట్రో వయా డక్ట్‌ను వాటిపై నుంచి నిర్మించాల్సి ఉన్నది. ఈ ఫైఓవర్లు ఇప్పటికే ఎత్తు 20-25 అడుగుల ఎత్తులో ఉన్నాయి. దీంతో ఒక్కసారిగా మెట్రో పిల్లర్ల ఎత్తు, వాటిపై వయాడక్ట్‌లను మరింత ఎత్తులో నిర్మించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితి ఎల్బీనగర్ చౌరస్తాలో ఉంటే... 350 మీటర్ల దూరంలోనే మరో ఫై ఓవర్ సాగర్ రింగు రోడ్డులో అడ్డుగా ఉంది. ఇది రెండో లెవల్ ఫై ఓవర్‌గా ఉండటంతో మరింత ఎత్తులో మెట్రో కారిడార్‌ను తీసుకువెళ్లాల్సి ఉంటుంది. వీటికితోడు ఈ రెండు చౌరస్తాల్లో ప్రయాణికుల కోసం మెట్రో స్టేషన్లను నిర్మించాల్సిన అవసరం ఉన్నది. ఇక్కడే మెట్రో అధికారులు ఒక పరీక్షగా మారింది. అత్యంత ఎత్తులో మెట్రో మార్గాన్ని నిర్మించడంతో పాటు అదే ప్రాంతంలో రెండు మెట్రో స్టేషన్లను నిర్మించాలన్న దానిపైనే అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ఇంజినీరింగ్ పరంగా తమకు పెద్ద సవాలుగా మారిందని మెట్రో అధికారులు పేర్కొంటున్నారు.

మార్చి చివరి నాటికి డీపీఆర్...

మెట్రో రెండో దశ డీపీఆర్‌ను త్వరగానే పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో రెండు వేర్వేరు కన్సల్టెన్సీలతో హైదరాబాద్ మెట్రో అధికారులు క్షేత్ర స్థాయిలో పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. 70 కి.మీ మెట్రో మార్గంలో ఒకేసారి డీపీఆర్ రూపకల్పనకు అవసరమైన పనులు కన్సల్టెన్సీలు చేస్తున్నాయి. పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే రెండో దశ మెట్రోకు శంకుస్థాపన చేసి, ఆ తర్వాత మార్చి చివరి నాటికి డీపీఆర్ సిద్ధం చేసేలా చూడాలని మెట్రో అధికారులకు సర్కారు సూచించింది. దీంతో శరవేగంగా రెండో దశకు సంబంధించిన 7 కారిడార్లలో డీపీఆర్‌కు అవసరమైన అంశాలను అధ్యయనం చేస్తున్నారు. మొత్తంగా మెట్రో రెండో దశ పనులు వేగంగా సాగుతుండగా, అదే సమయంలో ఇంజినీర్లకు కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటికి సులభమైన పద్ధతులను అన్వేషించే పనిలో ఇంజినీర్లు నిమగ్నమయ్యారు. మొదటి దశ మెట్రో కారిడార్ల నిర్మాణంలోనూ ఎన్నో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని విజయవంతంగా నిర్మాణం పనులు పూర్తి చేసిన మెట్రో యంత్రాంగమే.. ఇప్పుడూ పని చేస్తోంది. డీపీఆర్‌కు రూపకల్పన చేసి ప్రాజెక్టు వ్యయాన్ని అంచనా వేసే పనిలో మెట్రో అధికారులు తలమునకలై ఉన్నారు.

మాకు మెట్రో కావాల్సిందే..

సుచిత్ర చౌరస్తాలో ఆందోళన చేస్తున్న మెట్రో సాధన సమితి సభ్యులు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 25 : ప్యారడైస్ నుంచి బోయిన్‌పల్లి మీదుగా సుచిత్ర-కొంపల్లి-మేడ్చల్ వరకు మెట్రో రైలును ఏర్పాటు చేయాలంటూ.. మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో కొన్ని రోజుల నుంచి వివిధ రూపాల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇందులోభాగంగా ఆదివారం సుచిత్ర చౌరస్తాలో జాతీయ రహదారి-44పై ఆందోళన చేపట్టారు. వీరి నిరసనకు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మెట్రో సాధన సమితి ప్రతినిధులు సంపత్‌రెడ్డి, రాజారెడ్డి, మహేందర్‌రెడ్డి, జార్జ్, అరవింద్ రావు, కృష్ణారెడ్డి, ఉదయ్‌శంకర్, కిషన్ రెడ్డి, సుబ్బారావు, శేఖర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయ నిర్వాహకులు, తండావాసులతో ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

ప్రముఖ సినిమా ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్

కడ్తాల్, ఫిబ్రవరి 25 : సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని ప్రముఖ సినిమా ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్ అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని పాతకోటతండాలో జరుగుతున్న ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో ఆదివారం వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలతో సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధికి వారు రూ.25వేలను నిర్వాహకులకు అందజేశారు. అనంతరం వారికి నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అలివేలు, నాయకులు జీర్యానాయక్, గోపీనాయక్, శ్రీనివాస్, తావుర్యా, ధర్మానాయక్, రాజేశ్, రమేశ్, గోపాల్, మల్లేశ్, సీతారాం, డాకూనాయక్, వెంకటేశ్ పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో వచ్చి.. బూతులు తిట్టి..

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25: రద్దీరోడ్డుపై రాంగ్‌రూట్‌లో రావడమే కాదు.. అడ్డుకున్న ట్రాఫిక్ హోంగార్డుపై అనుచిత వ్యాఖ్యలు చేసి.. దాడి చేసిన మహిళపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ పీఎస్‌కు చెందిన హోంగార్డు విఘ్నేష్ శనివారం రాత్రి రోడ్ నం. 12లోని అగ్రసేన్ చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఓ మహిళ తన కారులో రాంగ్‌రూట్‌లో వేగంగా దూసుకురావడడాన్ని గమనించిన హోంగార్డు విఘ్నేశ్ ఆపారు. రద్దీ రూట్లో రాంగ్‌రూట్‌లో కారు వస్తే ప్రమాదాలు జరుగుతాయని, కారును వెనక్కి తిప్పాలని సూచించారు. అయితే రాంగ్‌రూట్‌లో వెళ్లినందుకు తన కారు ఫొటోలు తీసుకుని చలానా వేసుకోవాలని, తాను మాత్రం ముందుకే వెళ్తానంటూ కారులోని మహిళ వాగ్వాదానికి దిగింది. అయితే కారును ముందుకు వెళ్లని చ్చేది లేదంటూ విఘ్నేష్ చెప్పడంతో రెచ్చిపోయిన మహిళ.. కారులోంచి బయటకు దిగి తీవ్రపదజాలంతోదూషించడంతో పాటు దాడి చేసి లైఫ్ జాకెట్‌ను చింపేసి మొబైల్ ఫోన్‌ను పగలగొట్టింది. బాధితుడు విఘ్నేష్ ఇచ్చిన ఫిర్యాదుతో నిందితురాలిపై ఐపీసీ 332, 353, 427, 504, 279తో పాటు పీడీపీపీ యాక్ట్, ఎంవీ యాక్ట్స్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మ్యాన్‌హోల్ మూతలు మాయం

అమీర్‌పేట్ డివిజన్‌లోని లీలానగర్‌లో మూడు రోజులుగా మ్యాన్‌హోల్ మూతలు చోరీ అవుతున్నాయంటూ కాలనీ సంఘం ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సార్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. లీలానగర్ కాలనీలో 15కు పైగా మ్యాన్‌హోళ్ల మూతలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోవడంతో కాలనీ ప్రతినిధులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. - వెంగళరావునగర్, ఫిబ్రవరి 25

వెంకన్న బ్రహ్మోత్సవాల్లో ఎడ్ల పందాలు

కందుకూరు, ఫిబ్రవరి 25: కందుకూరు మండల పరిధిలోని పులిమామిడిలో గల చీకటి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఎడ్ల పందాలను నిర్వహించారు. పండితులతో పాటు నిర్వాహకులు. వివిధ పార్టీల నాయకులు, భక్తులు సమష్టిగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. అందులో భాగంగా నిర్వహించిన పందాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎడ్ల పందాల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి కింద రూ.35 వేలు, రెండో బహుమతి కింద రూ.25 వేలను, మూడో బహుమతి కింద రూ.15 వేలను దేవాలయ కమిటీ సభ్యులు అందజేశారు. కమిటీ సభ్యులు, పండితులు పాల్గొన్నారు.